క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. రెండు కామర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆంగ్లమాధ్యమంలో బోధించ గలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. కామర్స్ సబ్జెక్టులో కనీసం 55శాతం పీజీ మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం ఉన్నప్పటికీ సరిపోతాయన్నారు. పీహెచ్‌డీ, నైట్ స్లెట్లలలో ఏదో ఒకటి ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 10న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

చెక్‌పోస్టులు ఏర్పాటు


ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్సై, సిబ్బంది

జన్నారం: ఎన్నికలు సమీపిస్తున్నందునా జన్నారం మండలంలోని సరిహద్దు జిల్లా ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండలంలోని ఇందన్‌పల్లి, కలమడుగు గ్రామాల్లోని అటవీశాఖ చెక్ పోస్టుల వద్ద పోలీసుల తనిఖీలు ఉంటాయని ఎస్సై సతీశ్ తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు, అక్కడ సిబ్బందిని నియమించినట్లు ఎస్సై తెలిపారు.

పన్ను బకాయిలు చెల్లించాలి


తాళం వేస్తున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే మొత్తం పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల మసీదు కమిటీకి చెందిన భవనం పన్ను రూ.2.50లక్షలు ఉండగా, దానిని చెల్లించకపోవడంతో శనివారం మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2024మార్చి నెల వరకు చెల్లించే పన్ను సైతం వెంటనే చెల్లించి, ప్రజలు సహకరించాలని కోరారు.

టీకా కేంద్రాల పరిశీలన

దండేపల్లి: మండలంలోని గూడెం, నంబాల, ద్వారక ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలోని కన్నెపల్లి, వెల్గనూర్, కొండాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకా కేంద్రాలను మంచిర్యాల డివిజన్ ఆరోగ్య అధికారులు రామ్మూర్తి, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్ శనివారం సందర్శించారు. టీకాలు ఇచ్చిన వెంటనే, వాటి వివరాలను 'యూవిన్' ఆప్‌లో నమోదు చేయాలన్నారు. టీకాలకు సంబంధించిన రిజిష్టర్లు పరిశీలించారు. టీకా కేంద్రాల్లో హబ్‌కట్టర్, ఏఈఎఫ్ఐ కిట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంసీపీ కార్డును పూర్తిగా నింపాలన్నారు. చిన్నారులకు ఏ ఒక్క టీకా మిస్ కాకుండా చూడాలన్నారు. అనంతరం, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తల్లిపాల ప్రాముఖ్యతను, టీకాలను గురించి పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ


కొబ్బరి కాయ కొడుతున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 13వార్డులో కొత్తగా నిర్మించే సీసీరోడ్లకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం భూమిపూజ చేశారు. సీసీ రోడ్ల కోసం ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు ప్రభాకర్, కృష్ణ, బస్తీ వాసులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా నాయకురాలు పెండెం శ్రీలత, కార్యకర్తలు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే దివాకర్‌రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


సిద్ధమవుతున్న పర్యావరణ హిత విగ్రహం




విభిన్న రూపాల్లో సిద్ధం అవుతున్న దుర్గామాతా విగ్రహాలు

దుర్గమ్మకు తుదిరూపం

సండే స్పెషల్

- దేవీ నవరాత్రులకు సిద్ధమవుతున్న అమ్మవారు
- ఈనెల 13 నుంచి ఉత్సవాలు..
- అందుబాటులో పర్యావరణ హిత విగ్రహాలు


అమ్మవారి విగ్రహాలు

మంచిర్యాలఅర్బన్: దసరా(విజయదశమి) హిందువులకు పెద్ద పండుగ. ఈ సందర్భంగా దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 13నుంచి ఉత్సవాలు నిర్వహించనుండగా ఊరూరా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడనుంది. శరన్నవరాత్రుల్లో దుర్గామాత(అమ్మవారు) తొమ్మిది రోజులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా కొలువుదీరనున్న అమ్మవారి విగ్రహాలు కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకుంటున్నాయి. విగ్రహాలను కోరుట్ల నుంచి తయారు చేయించి వ్యాపారులు మంచిర్యాలకు దిగుమతి చేసుకుంటున్నారు. వెంపల్లి గ్రామశివారులో దుర్గాదేవి విగ్రహాల తయారీని ప్రత్యేకంగా చేపడుతున్నారు. అన్నపూర్ణేశ్వరి, సింహవాహిని, మహంకాళీ, పులివాహనంపై స్వారీ చేస్తున్న మాతేశ్వరి ఇలా వివిధ రూపాల్లో అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేశారు.

పర్యావరణ హితంగా..

వినాయకుడు, దసరా వచ్చిందంటే చాలు ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసే విగ్రహాలకు రెక్కలు వస్తాయి. పర్యావరణానికి హాని కలిగిస్తుందని తెలిసి కూడా విగ్రహాలు కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో స్థిరపడిన బెంగాలీ కాందిశీకుల ఆరాధ్యమైన కాళీమాతకు మరోరూపమైన దుర్గాదేవిని ఐదురోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. సర్వ జననీ దుర్గాదేవి మండలి ఆధ్వర్యంలో 15ఏళ్లుగా పర్యావరణ హితంగా మట్టితో తయారు చేయించిన విగ్రహాలకు పూజలు చేస్తున్నారు. దుర్గాదేవికి అక్కచెల్లెళ్లు లక్ష్మీదేవి, సరస్వతీ, కుమారులైనా గణపతి, కార్తికేయుల విగ్రహాలు కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్నాయి. శరన్నవ రాత్రుల కోసం శరవేగంగా విగ్రహాలు సిద్ధమవుతున్నాయి.

ధరలు ఇలా..

దేవీ నవరాత్రి ఉత్సవాలకు విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. విగ్రహాల ఎత్తు, రూపంను బట్టీ ధరలు పలుకుతున్నాయి. రూ.10వేల నుంచి 40వేల పైన ధరలున్నాయి. 100నుంచి 300పైగా విగ్రహాలు విక్రయాలు జరుగుతాయని తెలుస్తోంది.

వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం



ఏటా దుర్గాదేవీ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం. అమ్మవారికి హారతి, పుష్పాంజలి, మహాప్రసాద కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. వేడుకల్లో పాల్గొనటానికి దూరప్రాంతాల్లో నివసించే బెంగాళీలంతా మంచిర్యాలకు వస్తారు. పదిహేను సంవత్సరాలుగా పర్యావరణ హిత దేవతా విగ్రహాలను పూజిస్తున్నాం.

– రీణారాణిదాస్, సర్వజననీ దుర్గాదేవి పూజా కమిటీ సభ్యురాలు

కెనాల్ భూమి కబ్జాపై చర్యలేవి?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

జన్నారం: కడెం ప్రాజెక్టు ప్రధాన కాలువకు ఇరువైపులా గల కెనాల్ భూమి కబ్జా చేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. జన్నారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని కామన్‌పల్లి సమీపంలో కెనాల్ భూమి కబ్జాకు గురైందని పలుమార్లు తెలిపినా, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, జన్నారం ఎంపీటీసీ రియాజొద్దీన్ ఆరోపించారు. ఇరిగేషన్ ఏఈ రాజు సమాధానం ఇస్తూ.. కబ్జా విషయంలో స్పందించినట్లు, రెవెన్యు అధికారులతో కలిసి జాయింట్ సర్వే చేయడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తహసీల్దార్ వనజారెడ్డి జోక్యం కల్పించుకొని తమకు లిఖిత పూర్వకంగా రాసి ఇస్తేనే, ఈ విషయంలో ముందుకు వచ్చి సర్వేయర్‌తో పూర్తి స్థాయిలో సర్వే చేయిస్తామన్నారు. వరి పంట ఆఖరి దశకు వచ్చినందునా, రైతులకు యూరియా అవసరం పెరిగిందని, సొసైటీలకు కాకుండా ప్రైవేట్ డీలర్లకే యూరియా ఎక్కువగా సరఫరా చేస్తున్నారని తపాలపూర్ సర్పంచ్ నైనాల తిరుపతి ఆరోపించారు. యూరియా ట్రాన్స్‌పోర్ట్ వల్ల ఆలస్యం అయిందని, ఏవో సంగీత సమాధానం ఇచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో ఇళ్లపై నుంచే విద్యుత్ లైన్ వెళ్లడం వల్ల ప్రమాదకరంగా మారిందని, విద్యుత్ అధికారులు దృష్టి సారించి, విద్యుత్‌లైన్ మరోచోట వేసేలా చూడాలని పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఎంపీటీసీ రియాజొద్దీన్ కోరారు. సమావేశంలో ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ వనజారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంటకార్మికుల నిరసన


గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

కాసిపేట/మంచిర్యాలఅర్బన్/నెన్నెల: మంచిర్యాల ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట తమ డిమాండ్లు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం పదోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడారు. కాసిపేటలో సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. నెన్నెలలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.

క్రీడాకారులను అభినందించిన కమిషనర్


విజేతలను ప్రశంసిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: గోవాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి యోగా చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన యోగా క్రీడాకారులను బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అభినందించారు. మున్సిపల్ కార్యాలయంలో యోగా క్రీడా పోటీల విజేతలకు శనివారం సర్టిఫికెట్లు అందించి ప్రశంసించారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లి వశిష్ట యోగా కేంద్రం క్రీడాకారులు డి.ఖుషి, పి.మానస, కె.శిరీష, హేమలత, అశోక కుమారి, యోగా కోచ్ రమణ మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. వీరిని అభినందించి భవిష్యత్‌లోనూ యోగా పోటీల్లో సత్తా చాటాలని కమిషనర్ కోరారు.

రాముని చెరువు సుందరీకరణ పూర్తి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న వాకర్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ.3.5కోట్లతో పనులను ప్రారంభించి, మధ్యలోనే నిలిపివేశారని, వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రామునిచెరువు వాకర్ సభ్యులు శనివారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామునిచెరువు కట్టపై వందలాది మంది ప్రతిరోజు వాకింగ్ చేయడంతో పాటు, ఆహ్లాదం కోసం వచ్చేందుకు అవకాశం లేకుండా అసంపూర్తిగా పనులను చేసి వదిలేశారన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం వల్ల గతేడాదిన్నరగా పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాకింగ్ ట్రాక్‌ను లెవలింగ్ చేసి, చెరువులోని పూడికతీత మట్టిని తొలగించి పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్ సభ్యుల అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సభ్యులు కె. ప్రభాకర్, శంకర్, నర్సింగరావు, ఎన్. స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు.

విపక్ష నాయకుల ముందస్తు అరెస్ట్


అరెస్టైన నాయకులు

చెన్నూర్: చెన్నూర్‌లో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పర్యటన సందర్భంగా పోలీసులు విపక్ష పార్టీ నాయకులకు ముందస్తుగా సీఐ వాసుదేవరావు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో వైఎస్సార్‌టీపీ దర్గం నరేశ్, కాంగ్రెస్ నాయకులు చీర్ల సుధాకర్‌రెడ్డి, జూల లక్ష్మణ్, చెన్నూరి శ్రీధర్, ఖాలీల్, చెన్న నారాయణ, ఈర్ల నారాయణ, మల్లయ్య, మహేశ్, పాతర్ల నాగరాజు, బీజేపీ నాయకులు ఆలం బాపు, బీఎస్పీ నాయకులు నిట్టూరి సారయ్య, టీడీపీ పట్టెం తిరుపతి తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు క్రీడల్లో రాణించాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు క్రీడల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో శనివారం ఏరియా స్థాయి డిపార్టుమెంటల్ వార్షిక క్రీడలు ప్రారంభమయ్యాయి. పోటీలను జీఎం సంజీవ రెడ్డి ప్రారంభించారు. కంపెనీ స్థాయిలో, కోలిండియా స్థాయిలో కూడా ఏరియా క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం రఘుకుమార్. ఇన్చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వరరావు, స్పోర్ట్స్ సెక్రెటరీ పాలకుర్తి రాజు, సూపర్వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

సేవా సమితితో ఉద్యోగాలు


జీఎంతో ఉద్యోగం సాధించిన అభ్యర్థులు

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఇచ్చిన ఉచిత శిక్షణతో పోలీసు ఉద్యోగాలు సాధించడం అభినందనీయం అని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సింగరేణి సేవా సమితి ద్వారా 197 మందికి శ్రీరాంపూర్‌లో పోలీసు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ అందించారు. వీరిలో 23మంది పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. వీరిని శనివారం జీఎం కార్యాలయంలో సంజీవరెడ్డి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఏరియా ఎస్వోటుజీఎం రఘుకుమార్‌, డీజీఎం(ఫైనాన్స్) మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వినతి

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై శనివారం ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూస్తున్న పీఎల్ఆర్ బోనస్ జాతీయసంఘాలు రూ.లక్ష రూపాయలకు తగ్గకుండా ఇప్పించాలని డిమాండ్ చేస్తూ గని మేనేజర్ లక్ష్మినారాయణకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో గని ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ సెగ్గం శ్రీను, ఓవర్‌మెన్ లింగాల శ్రీనివాస్, కార్తిక్, రాజయ్య, వెంకటేష్, కృష్ణమోహన్ తదితరులున్నారు.

ఎస్సీ ఉద్యోగుల అభినందన



శ్రీరాంపూర్: నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కుమార్‌ను సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బెల్లంపల్లిలోని ఆయన నివాసంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, కార్యదర్శులు కంబాల నాగయ్య, రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నూరు శ్రీనివాస్, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'చిచ్చుపెడితే ఊరుకోం'

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఒక ప్రజాప్రతినిధి ప్రయత్నిస్తున్నారని, అలాంటి నిర్ణయాలు మానుకోవాలని బీసీ సంఘాల పోరాట సమితి జిల్లా నాయకులు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్ ఆరోపించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కొన్ని కులాల వారితో సంప్రదిస్తూ, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, ఇలాంటి సంఘటనలు జరిగితే ఊరుకోబోమని, బీసీ సంఘాల ఐక్యంగా ముందుకు పోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మల్లయ్య, రాజేశ్‌యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, సత్యనారాయణ, భూమన్న, సత్తన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సుమారు 100మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

రామకృష్ణాపూర్: పట్టణంలోని బీజోన్ ఏరియాకు చెందిన పురుషోత్తం కనకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతడి కుటుంబానికి బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

క్యాతనపల్లి అధ్యక్షుడిగా మహేందర్

రామకృష్ణాపూర్: బీజేపీ అనుబంధ ఎస్సీ మోర్చ క్యాతనపల్లి అధ్యక్షుడిగా ఎం.మహేందర్‌ను నియమించారు. పార్టీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం నియామకపు ఉత్తర్వులు అందించారు.

ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ గడువు పెంపు

బెల్లంపల్లి: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశం పొందడానికి అడ్మిషన్ గడువును పొడిగించినట్లు బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ ఎ.అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు ప్రవేశం గడువు ఉందని విద్యార్థులు సకాలంలో అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. ఇదే చివరి గడువని పేర్కొన్నారు.

బీఎస్పీలో చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని 28వ వార్డుకు చెందిన పలువురు శనివారం బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో బీఎస్పీలో చేరారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట, గొల్లపల్లి గ్రామాల్లో శనివారం 12మంది లబ్ధిదారులకు ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ ఇందూరి శశికళ రెండో విడత గొర్రెలను పంపిణీ చేశారు.

రక్తదానం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణం సంజీవయ్య కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు ఇన్‌చార్జి వెంకటసాయి కృష్ణ జన్మదినం పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో మొత్తం 15మంది యువకులు శనివారం రక్తదానం చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

వేమనపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాదవ్ శనివారం భూమి పూజ చేసి ప్రారంభించారు.

పట్టణ అధ్యక్షురాలిగా పద్మాదేవి

పాతమంచిర్యాల: తెలంగాణ బీసీ జాగృతి పట్టణ మహిళా అధ్యక్షురాలిగా ఆకుతోట పద్మాదేవిని నియమించినట్లు తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ తెలిపారు. బీసీ జాగృతి సంస్థాగత నిర్వహణలో భాగంగా నియమించి నియామకపత్రం అందించారు.

పంటలపై రైతులకు అవగాహన

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట రైతులకు శనివారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ పంటలపై అవగాహన కల్పించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని కేతన్‌పల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివశంకర్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

కోటపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో మల్లంపేటలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందంతో బ్యాంక్ పథకాలు, క్రాప్‌లోన్స్, పొదుపు లోన్స్‌పై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ అనిల్, కళాజాత బృందం విజయ్, విష్ణు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తాండూర్: మండలంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ముల్కల జ్యోతి అనే మహిళ కరెంట్ షాక్‌తో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, నాయకులు సాంబయ్య, అంజి పరామర్శించి 25కిలోల బియ్యం అందజేశారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని చెండే నాగుమేర స్వాతంత్య్ర సమరయోధుడి కుటుంబాన్ని శనివారం డీఆర్‌డీఏ పీడీ శేషాద్రి పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. డీపీఎం వేణుగోపాల్, కన్నెపల్లి, భీమిని ఏపీఎంలు విజయలక్ష్మి, ప్రకాష్‌గౌడ్, సీసీలు నారాయణ, అశోక్, లక్ష్మణ్ ఉన్నారు.

విద్యార్థులకు శానిటరీ నాప్‌కిన్స్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచిర్యాల ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రీ యూజబుల్ శానిటరీ నాప్‌కిన్స్ అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్వేత, అసోసియేట్ మేనేజర్ సుజాత, పాఠశాల ఇంచార్జీ పద్మజ, ఉపాధ్యాయులు కళ్యాణి పాల్గొన్నారు.

యువకులకు సన్మానం

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన పాలవేణి సంతోష్(టీఎస్‌పీఎస్‌సీ), లక్కాకుల ఆశిష్(అగ్నిపథ్), సంద్రల్‌పహాడ్‌కు చెందిన వంశీ(సివిల్)ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ క్రీడాకారులు సన్మానించారు.

బతుకమ్మ చీరల పంపిణీ

జైపూర్: మండలంలోని పెగడపల్లిలో ప్రభుత్వం బతుకమ్మ కానుకగా అందజేసిన చీరలను సర్పంచ్ పదాల పదాల రాజమణి, ఉపసర్పంచ్ రిక్కుల వెంకట్‌రెడ్డి, స్థానిక నాయకులు గ్రామస్తులకు అందజేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గిరిజన గ్రామాలైన గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గ్రామాల్లోని మహిళలకు శనివారం ప్రభుత్వం సరఫరా చేసిన చీరలను సర్పంచులు లక్ష్మి, రాజు, సోనేరావు, భీంబాయి పంపిణీ చేశారు.

చెన్నూర్ తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

జైపూర్: మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజాప్రతి నిధులు పెద్ద ఎత్తున చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు రోడ్ షో కార్యక్రమానికి తరలివెళ్లారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని వేంపల్లి మంచిర్యాల గార్డెన్స్‌లో శనివారం శ్రీహర్ష డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. కళాశాలలో ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసిన అనంతరం కళాశాల చైర్మన్ పల్లె భూమేశ్ మాట్లాడారు. కానిస్టేబుల్ ఫలితాల్లో కళాశాల నుంచి 18మంది ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఈ క్రమంలో మూడేళ్ల డిగ్రీ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనితాఠాకూర్, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సినీ, జానపద నృత్యాలు విశేషంగా అలరించాయి.